www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 నవంబర్ 2025
5
చిత్తూరు

కుప్పం చేరిన కుంకీలు

- ప్రజాశక్తి కథనంతో అప్రమత్తమైన అధికారులు
- డిప్యూటీ సీఎం దృష్టికి ఏనుగుల దాడులు
- అడవి ఏనుగులను నియంత్రించేందుకు చర్యలు
- ఒంటరి ఏనుగును అదుపు చేసేందుకు స్పెషల్ డ్రైవ్

కుప్పంకు చేరుకున్న కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్   గాయపడిన జయంత్‌ను పరిశీలిస్తున్న వెటర్నరీ డాక్టర్

ప్రజాశక్తి - కుప్పం

రామకుప్పం మండలం ననియాల ఎలిఫెంట్ క్యాంప్ నుండి ఆరు నెలల క్రితం పలమనేరు ముసలిమడుగుకు తరలించిన రెండు కుంకీ ఏనుగులు మళ్ళీ కుప్పం చేరాయి.. కుప్పం ప్రాంతంలో ఇటీవల ఏనుగుల దాడులు అధికం కాగా కూర్మాయపురం వద్ద రైతు కిట్టప్పను ఒంటరి ఏనుగు తొక్కి చంపింది. ఇది జరిగిన మరుసటిరోజే కుప్పం సరిహద్దులోని తమిళనాడు ప్రాంతంలో వృద్ధ దంపతులపై ఏనుగులు దాడిలో భార్య మృతిచెందగా భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో 'ప్రజాశక్తి' దినపత్రికలో ఈనెల 16న ప్రచురితమైన 'మరణ మృదంగం' కథనం పట్ల జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

డిప్యూటీ సీఎం దృష్టికి కుప్పంలో ఏనుగు దాడులు

సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఏనుగు దాడుల విషయాన్ని అటవీ ఉన్నతాధికారులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో స్పందించిన డిప్యూటీ సీఎం కుప్పంలో ఏనుగు దాడులను నియంత్రణకు వెంటనే కుంకీ ఏనుగులను కుప్పం పంపాలని ఆదేశించడంతో పలమనేరు ముసలిమడుగు వద్దనున్న రెండు కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్‌లను సోమవారం పలమనేరు సబ్ డివిజనల్ డిఎఫ్ఓ వేణుగోపాల్, కుప్పం ఎఫ్ఆర్ఓ జయశంకర్ కుప్పంకు తీసుకొచ్చారు. ప్రస్తుతం కుప్పం సరిహద్దులోని తమిళనాడు రాష్ట్రం వరట్నంపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న ఒంటరి మదపుటేనుగు మళ్లీ నడుమూరు అటవీ ప్రాంతం వైపు వచ్చే అవకాశం ఉండడంతో రెండు కుంకీ ఏనుగులను ఫారెస్ట్ అధికారులు నడుమూరు నర్సరీ వద్దకు తరలించారు. తమిళనాడు వైపు నుండి ఏనుగులు మళ్లీ గ్రామాల వైపు వస్తే శిక్షణ పొందిన కుంకి ఏనుగుల ద్వారా అడవి ఏనుగులను భయపెట్టి అటవీ ప్రాంతంలోకి తరిమికొట్టనున్నారు.

ఒంటరి ఏనుగును అదుపు చేసేందుకు స్పెషల్ డ్రైవ్

ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు సరిహద్దులో బీభత్సం సృష్టిస్తూ ప్రజలపై దాడులకు ఎగబడుతున్న ఒంటరి మదపుటేనుగును అదుపు చేసేందుకు కుంకి ఏనుగుల ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ఫారెస్ట్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఒంటరి మదపుటేనుగు కర్ణాటకలో ఇద్దరు, కుప్పంలో ఒకరు, తమిళనాడులో ఒకరిని తొక్కి చంపగా ఏనుగు దాడిలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుంకి ఏనుగుల ద్వారా ఒంటరి ఏనుగును అదుపు చేసేందుకు కాకపోతే మత్తుమందు ఇచ్చి బంధించేందుకు సైతం ఫారెస్టు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

మళ్లీ ననియాలకు జయంత్, వినాయక్

రామకుప్పం మండలం ననియాల ఎలిఫెంట్ క్యాంప్ నుండి ఆరునెలల క్రితం పలమనేరు ముసలిమడుగు వద్ద కర్ణాటక నుండి వచ్చిన నాలుగు ఏనుగులకు శిక్షణ ఇచ్చేందుకు తీసుకెళ్లిన జయంత్, వినాయక్‌లను కుప్పం నుండి మళ్లీ రామకుప్పం తరలించనున్నట్లు పలమనేరు సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్ తెలిపారు. ప్రస్తుతం నడుమూరు నర్సరీ వద్ద రెండు ఏనుగులను ఉంచి అడివి ఏనుగులను నియంత్రించడం జరుగుతుందని ఆతర్వాత ననియాల ఎలిఫెంట్ క్యాంపుకు తరలిస్తామన్నారు.

జయంత్‌కు మస్త్.. అప్రమత్తమైన అధికారులు

కుంకి ఏనుగుల్లో ఒకటైన జయంత్ మస్త్ రావడంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. సాధారణంగా ఆగస్టు నుండి డిసెంబర్ మధ్య మగ ఏనుగులు పునరుత్పత్తి హార్మోన్ల పెరుగుదల వలన మస్త్ వస్తుంది. ఈ సమయంలో ఏనుగులు చాలా దూకుడుగా ప్రవర్తిస్తాయి. మగ ఏనుగుల శరీరంలో కొన్ని గ్రంథుల నుండి స్రవించే 'టెంపోరిన్' అనే పదార్థం వల్ల వాటి చెవుల మధ్యలో నుండి ఒక ద్రవం కారుతుంది. కొన్ని సందర్భాలలో, ఏనుగులు ఈ దశలో అదుపు తప్పి ప్రవర్తించి, మనుషులపై లేదా ఇతర ఏనుగులపై దాడి చేసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో జయంత్‌ను వెటర్నరీ డాక్టర్ పరిశీలించారు. పలమనేరు ముసలిమడుగు వద్ద జయంత్‌ను లారీలో ఎక్కించే సమయంలో ఓ కుంకిపై స్వల్పంగా దాడి చేసినట్లు సమాచారం.

జంట ఏనుగుల హల్‌చల్...!

గజ దాడుల్లో పంటలు నష్టం

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని ననియాల తాండ గ్రామసమీపంలోని రైతులలు పండిస్తున్న పంటలను ఆదివారం రాత్రి జంట ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. అటవీ సిబ్బంది, ట్రాకర్లు ఏనుగులను అడవిలోకి తరిమెందుకు డ్రైవ్ చేస్తుంటే, అవి మరో వైపుగా గ్రామాల్లోకి వస్తున్నాయి. గ్రామానికి చెందిన దశరధ నాయక్, సామి నాయక్, రవి నాయక్, నాగరాజు నాయక్‌లకు చెందిన వరి, రాగి పంటలను తిన్నంత తిని, తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. స్థానిక రైతులు పంట పొలాల వైపు వెళ్లేందుకు ఏ సమయంలో ఏనుగులు దాడులు చేస్తాయో నని భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఏనుగుల దాడుల్లో నియోజకవర్గ పరిధిలో పంటల నష్టంతో పాటు, పలువురు ప్రాణాలు కోల్పోయారు. అటవీ శాఖ అధికారులు అటవీ సమీప రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

రాగి పంటను నాశనం చేస్తున్న జంట ఏనుగులు

మామిడి రైతులను ఆదుకోండి

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత : మంత్రి రాంప్రసాద్ రెడ్డి

మామిడి గుజ్జు పరిశ్రమ యజమానులతో మాట్లాడుతున్న జిల్లా మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి) : మామిడి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి, చిత్తూరు జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మామిడి పండ్ల పరిశ్రమల యజమానులకు సూచించారు. మామిడి రైతులకు చెల్లించవలసిన బకాయిల విషయంలో అలసత్వం వద్దని అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగిన మామిడి పండ్ల పరిశ్రమల యజమానుల సమీక్షా సమావేశానికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళి మోహన్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. కేజీ మామిడికి రూ.4లు మద్దతు ధర ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలో మామిడి పంటను పండించిన రైతులకు ప్రభుత్వం రూ.4ల సబ్సిడీ మేర రూ.183కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందని తెలిపారు. గతంలో మామిడి పంట దిగుబడి అధికంగా ఉండడంతో డిమాండ్ తగ్గి రైతులకు ఆశించిన ధర రాలేదన్నారు. ధరలేని కారణంగా రైతులు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో గిట్టుబాటు ధరగా రాష్ట్ర ప్రభుత్వం కేజీ మామిడికి రూ.4ల మద్దతు ధర ప్రకటించగా, ప్రొసెసింగ్ యూనిట్లు రూ.8లు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. చిత్తూరు జిల్లాలోని రైతులకు 31,929 మంది రైతులకు కేజీ మామిడికి రూ.4ల సబ్సిడీ చొప్పున మొత్తం రూ.146.84కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. రైతులకు చెల్లించాల్సిన మద్దతు ధర విషయంలో నిర్ణీత సమయంను నిర్దేశించుకుని ముందుకు వెళ్ళాల్సిందిగా మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యంకు సూచించారు. ఎంపి మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమ రైతుల ఉత్పత్తులపై ఆధారపడి ఉందని, రైతులు సైతం పరిశ్రమలపై ఆధార పడి ఉన్నారన్నారు. గుజ్జు పరిశ్రమలు, మామిడి రైతులు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పరిశ్రమల నుంచి ఎంత ధర రైతులకు పరిశ్రమ యజమానులు చెల్లిస్తారో.. సమగ్రంగా వివరణ ఇవ్వాలని పల్స్ పరిశ్రమల ప్రతినిధులను కోరారు. మద్దతు ధరలు చెల్లించడం ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో పరిశ్రమలు చెల్లించవలసిన మనీ వివరాలను ధరను వీలైనంత త్వరగా జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదించాలన్నారు. రైతు కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ధరలు సూచించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో 2.40లక్షల మెట్రిక్‌ల మామిడిని జూన్, జూలై మాసాలలో రైతుల నుండి గుజ్జు పరిశ్రమలకు సమీకరించడం జరిగిందన్నారు. జూలై నెల మధ్యలో మామిడి మార్కెట్ లో ధర పెరిగి రైతులకు మంచి ధరలు వచ్చాయన్నారు. జిల్లాలో కొన్ని గుజ్జు పరిశ్రమలు రైతులకు చెల్లిస్తున్న మద్దతు ధరలు తమిళనాడు కృష్ణగిరిలో చెల్లిస్తున్న దానికంటే తక్కువగా ఉండడం గమనార్హం అన్నారు. మద్దతు ధర విషయంలో గుజ్జు పరిశ్రమలు, రైతులు పరస్పర సహకారంతో మాత్రమే అభివృద్ధి చెందాలన్నారు. పల్స్ పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ యూరోపియన్ దేశాలలో దిగుమతి సుంకాలు ఎక్కువ అవ్వడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని నిస్సహాయత వ్యక్తం చేశారు. మ్యాంగో పల్స్‌పై విధిస్తున్న జిఎస్టిని తగ్గించాలి, మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డిడి మధుసూదన్ రెడ్డి, పల్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రీఓపెన్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి : డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని డిఆర్ఓ కె.మోహన్ కుమార్ ఆదేశించారు. మండలస్థాయి కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కారం, ఇతర అంశాలపై సోమవారం జిల్లా అధికారులు, మండల స్పెషల్ అధికారులతో డిఆర్ఓ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ప్రతివారం మండల ప్రత్యేక అధికారులు సందర్శించాల్సిన ఒక సంస్థ ఎడబ్యూసీ, పిహెచ్‌సి, పాఠశాలలు, హాస్టళ్ళ, సచివాలయం, డ్రైనేజీ వ్యవస్థ ను సందర్శించాలని తెలిపారు. ప్రతి మంగళవారం సందర్శించాల్సిన సంస్థను హెచ్ఒడిల సమూహంలో పోస్ట్ చేస్తారన్నారు. బుధ, గురువారల్లో ఏదో ఒక రోజు తనిఖీ చేసి ప్రతివారం వారి సందర్శన సమయంలో మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలంలోని అన్ని మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని తెలిపారు.

బాలాజీ రైల్వే డివిజన్ ఉద్యమం చేపట్టాలి

ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావుకు వినతిపత్రం ఇస్తున్న సాధన సమితి నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: విశాఖ ఉక్కు ఉద్యమం తరహాలో తిరుపతి రైల్వే బాలాజీ డివిజన్ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని, దీనికోసం తిరుపతి బంద్‌కూ వెనుకాడబోమని వక్తలు అన్నారు. బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కుప్పాల గిరిధర కుమార్ అధ్యక్షతన బాలాజీ రైల్వే డివిజన్ సాధనకు సంబంధించి ప్రజా సంఘాలు మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం ఓ ప్రైవేట్ హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ అధ్యయనాల సమితి వ్యవస్థాపకులు భూమన సుబ్రమణ్యం రెడ్డి, తిరుపతి ఫిల్మ్ సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు కష్ణయ్య, ఫిల్మ్ సొసైటీ నాయకులు సిఆర్‌కే శేషగిరిరావు, ప్రొఫెసర్ స్వరాజ్యలక్ష్మి హాజరయ్యారు. ఈసందర్భంగా కుప్పాల గిరిధర్ కుమార్, రాయలసీమ అధ్యాయనాలు సమితి వ్యవస్థాపకులు భూమన సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఉద్యమం తరహాలో తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ సాధించుకోవలసిన అవసరం ఉందని దీనికి మేధావులు, రాజకీయ పార్టీలకు అతీతంగా నేతలు, కవులు, రచయితలతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులతో పాటు డాక్టర్లు ఐక్యంగా ఉండి సాధించుకుంటే తప్ప బాలాజీ డివిజన్ వచ్చే పరిస్థితి లేదన్నారు. వెనకబడిన ఉమ్మడి చిత్తూరు జిల్లా రైల్వే పరంగా ఎంతో వెనకబడి ఉందని, ఇక్కడ వనరులు ఉన్నా రైల్వే ప్రాజెక్టులు, ఉద్యోగాలు రావడం లేదన్నారు. పాలకులు ఉమ్మడి చిత్తూరు జిల్లా రైల్వే అభివద్ధికి ఎలాంటి చొరవ చూపడం లేదన్నారు. ఈరౌండ్ టేబుల్ సమావేశంలో భూపాల్ నాయుడు, బుజ్జి బాబు నాయుడు, నీలేష్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి తీసుకెళ్తా : ఎంపి

బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి నాయకులు సోమవారం చిత్తూరులో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు కేంద్రం దృష్టికి తీసుకువెళతానన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు వలన స్థానికంగా ఉద్యోగావకాశాలు, వ్యాపార అభివృద్ధి మరింత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ మాట్లాడుతూ మనందరి విజన్ తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ అని అన్నారు.

కాలువల మరమ్మతులకు చర్యలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పీహెచ్ వాడ వార్డు పరిధిలో పలు మురుగునీటి కాలువలకు మరమ్మతులు చేయించాలని మేయర్ ఎస్.అముద ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేయర్, ఎంఈ వెంకట రామిరెడ్డితో కలిసి పీహెచ్ వాడ వార్డు పరిధిలో పర్యటించారు. చిత్తూరమ్మ గుడివీధి, భజన వీధి, మరాఠ వీధి, కోర్టు డౌన్ ప్రాంతాల్లో పర్యటించారు. పలు వీధుల్లో దెబ్బతిన్న మురుగునీటి కాలువలను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి మరమ్మతులు చేయించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పలు వీధుల్లో మురుగునీటి కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం చేయకండి.. కలెక్టర్

పిజిఆర్ఎస్‌కు 274 వినతులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినుతల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన 274 అర్జీలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డిఆర్ఓ మోహన్ కుమార్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కరుణ కుమారి, డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితులో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించి 189, పోలీస్‌శాఖ 12, పంచాయతీరాజ్ 4, అటవీ శాఖ 1, విద్యాశాఖ 3, వ్యవసాయ శాఖ 2, రిజిస్ట్రేషన్, స్టాంపులు 3, హార్టికల్చర్ 5, డిఆర్‌డిప 32, ఇరిగేషన్ 2, విద్యుత్ శాఖ 2, సర్వశిక్ష అభియాన్ 3, పశు సంవర్ధక శాఖ 7, గృహ నిర్మాణ సంస్థ 2, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 3, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ 1, మైన్స్ అండ్ జియాలజీ 1, ఎంపీడీవో పూతలపట్టు 1, ఎంపీడీవో యాదమరి 1 అర్జీలు అందాయి.

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 13 వినతులు అందినట్లు నగర సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గతవారం అందిన వినతుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోమవారం కార్యక్రమంలో రెవెన్యూ 5, ఇంజనీరింగ్ 4, టిడ్కో 3, పింఛన్లు 1 చొప్పున మొత్తం 13 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుండీ అర్జీలు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్

సమస్యలు త్వరగా పరిష్కరించాలి: ఎస్పీ

చిత్తూరుఅర్బన్: సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో ప్రజల నుంచి 38 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ తుషార్ డూడి స్వీకరించారు. ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సమస్యలు వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ తగాదాలు 8, వేధింపులు 2, భూ తగాదాలు 8, డబ్బు తగాదాలు 4, చిన్న గొడవలు 3, పోలీసు సేవలు 6, ఆస్తి తగాదాలు 6, దారి సమస్య 1 ఉన్నాయి.

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

భూ సమస్యలు పరిష్కరించరా..?

కలెక్టరేట్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వ్యవసాయ భూమి వద్దకు దారి సమస్యల పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చినా, స్థానిక తహశీల్దార్‌లకు విన్నవించుకున్నా పరిష్కరం కాకపోవడంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట తన వెంట తెచ్చుకున్న పురుగుల మందుతాగి ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించిన సంఘటన చేసుకుంది. వికోట మండలం మిట్టూరు చెందిన నందిని, భర్త సుబ్రమణ్యం, వారి ఇద్దరు పిల్లలతో సహా కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక భవనం ముందు నందిని వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగి ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించింది. గుర్తించిన ఆమె బంధువులు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలోని పోలీసులు నందిని హుటాహుటిన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమకున్న ఎకరం పొలానికి దారి సమస్యల పరిష్కరించాలని 8సార్లు జిల్లా కలెక్టర్‌కు వచ్చి ఫిర్యాదు చేశామని, స్థానిక తహశీల్దార్‌కు దృష్టికి పలుమార్లు తీసుకుపోయినా పట్టించు కోకపోవడంతో తన కుమార్తె నందిని విసిగిపోయి ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించిన్నట్లు బాధితురాలి తల్లి తెలిపారు. చికిత్స అందిన వైద్యులు నందిని పరస్థితి నిలకడగా ఉందని ప్రమాదం లేదని తెలిపారు.

ఆత్మహత్యకు ప్రయత్నించిన నందిని

రేపు నారా భువనేశ్వరి కుప్పం పర్యటన

ప్రజాశక్తి- కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 19 నుంచి 4 రోజులపాటు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. శాంతిపురం మండలం శివపురం వద్ద నూతనంగా నిర్మించిన సొంతింటిలో ఉంటూ నాలుగు రోజులపాటు నాలుగు మండలాల్లో భువనేశ్వరి పర్యటిస్తారు. గ్రామాల్లో మహిళలు, యువతతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. దీంతో నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గ పర్యటన కోసం టిడిపి శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కుప్పం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను నారా భువనేశ్వరి ప్రారంభించనున్నారు.

డీకేపల్లి చెరువును పరిశీలించిన ఎమ్మెల్సీ శ్రీకాంత్

కృష్ణా జలాలతో నిండిన డీకేపల్లి చెరువును సోమవారం సాయంత్రం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ టిడిపి నేతలు కలిసి పరిశీలించారు. హంద్రీనీవా జలాలతో కుప్పం ప్రాంతంలోని చెరువులకు జలకల సంతరించుకోగా కుప్పం పట్టణానికి మంచినీరు అందించే డీకేపల్లి చెరువు కృష్ణాజలాలతో కలకలాడుతోంది. సోమవారం డీకే పల్లి చెరువు నిండి మరవపోతుండగా 19న నారా భువనేశ్వరి చేతుల మీదుగా జల హారతి ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి టీడీపీ శ్రేణులు అధికారులకు ఎమ్మెల్సీ శ్రీకాంత్ దిశనిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్, కడా అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, కమిషనర్ శ్రీనివాసరావు, అప్పు, డీకే పల్లి మణి, వాసు, సోము, గని, నబి, తదితరులు పాల్గొన్నారు.

డీకే పల్లి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

మాధవ మృతికి సిఐటియు నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సిఐటియు ఉపాధ్యక్షురాలు అంగన్వాడీ యూనియన్ నాయకురాలు సుజని భర్త మాధవ గుండెనొప్పితో ఆదివారం రాత్రి మరణించారు. సోమవారం ఆయన భౌతిక గాయానికి సిఐటియు నాయకులు మాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు వాడ గంగరాజు, సురేంద్రన్, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర నాయకురాలు వాణిశ్రీ మాట్లాడుతూ మాధవ పంచాయతీ సెక్రటరీగా ఉంటూ ప్రజలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఎస్ఆర్ పురంలో పనిచేసే సందర్భంలో రోడ్డుప్రమాదంలో గాయపడి అనారోగ్యంతో బాధపడుతూనే విధులు నిర్వహిస్తున్నారని, ఆదివారం రాత్రి అకస్మాత్తుగా గుండెనొప్పితో మరణించడం జరిగిందన్నారు. సోమవారం వారి సొంతగ్రామమైన గుడిపాల మండలం కుప్పిగానేపల్లెలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో జిల్లాల్లోని అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు భారీ సంఖ్యలో హాజరై సుజని కుటుంబానికి వారి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిఐటియు నాయకులు బాలసుబ్రమణ్యం, యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, జిల్లా నాయకులు మమత, బుజ్జి, సుభాషిణి నివాళి అర్పించారు.

రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో కేజీబీ పాఠశాల విద్యార్థిని ప్రతిభ

విద్యార్థిని హరితతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం మండలం కస్తూర్బా బాలికల పాఠశాలలో చదువు తున్న ఎనిమిదో తరగతి విద్యార్థిని హరిత ఈ నెల మొదటి వారంలో శ్రీకాకుళం లో నిర్వ హించిన అండర్ 14 అట్లాంటిక్ రాష్ట్ర పోటీలలో 400 మీటర్ల పరుగు పందెంలో స్టేట్ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల క్రీడా ఉపాధ్యాయు రాలు రోహిణి క్లాస్ టీచర్ అక్తర్ హరితను అభినందించారు. రాష్ట్ర పరుగుపందెం పోటీలలో మొదటి స్థానం సాధించడం తనకు ఎంతో ఆనందం కలిగిస్తోందని వృందావన చేసుకుంటూ జీవనం సాగిస్తూ కస్తూర్బా కళాశాలలో చదువుతున్న హరిత తల్లిదండ్రులు అభినందించి తమకు ఎంతో గర్వకారణంగా వుందని పేర్కొన్నారని ఉపాధ్యాయులు తెలిపారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

ఉత్తమ ఫలితాలు సాధించాలి: ఎంఈఓ

ప్రజాశక్తి-సోమల: పదవ తరగతిలో విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితా లు సాధించి పాఠశా లకు, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సోమల మండల విద్యాశాఖ అధికారిణి విజయకుమారి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై సూచనలు , సలహాలు అందించారు. మధ్యాహ్న భోజనం మరింత రుచికరంగా విద్యార్థులకు అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు హేమ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లని వినియోగించాలి

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల మండలం బొమ్మయ్య గారి పల్లి గ్రామ పంచాయతీలో సదుం ఎంపీడీవో రాధా రాణి సోమవారం మరు గుదొడ్ల వాడకంపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాధారాణి మాట్లాడుతూ బొమ్మయ్య గారి పల్లి గ్రామ పంచా యతీలో 1135 కుటుంబాలు వారు మరుగుదొడ్లు నిర్మించు కున్నారని తెలిపారు. అయితే అక్కడక్కడా వేరు కుటుంబాలు అయినా అన్నదమ్ముల ఇళ్లలో మరుగుదొడ్లు లేవని గుర్తించారు. వీరందరికీ పక్కా ఇల్లు మంజూరైనవెంటనే వాటితోపాటు మరుగు దొడ్లు కూడా మంజూరు అవుతాయన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలని సూచించారు. గ్రామ పంచాయతీలో మరుగుదొడ్ల తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సదుం మండల ఆర్డబ్ల్యుఎస్ ఏఈ ఆది నారాయణ, బొమ్మయ్యగారిపల్లి పంచాయతీ సెక్రెటరీ హరిబాబు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపించండి..

కడ పీడీని కలిసిన పార్కు దుకాణదారులు

ప్రజాశక్తి -కుప్పం: కుప్పం జమీందారీ పార్కు ఎదుట దశాబ్దాలుగా వ్యాపారాలు చేసుకుంటున్న దుకాణదారులకు ప్రత్యామ్నాయం కల్పించి దుకాణాలను తొలగించాలని దుకాణదారులు సోమవారం కడ పీడీ వికాస్ మర్మత్ ను కోరారు. 10 కోట్లతో కుప్పం సెంట్రల్ పార్కు అభివృద్ధికి రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమరావతికి మాస్టర్ ప్లాన్ రూపొందించిన సుర్బాన సంస్థ కుప్పం సెంట్రల్ పార్కు అభివృద్ధికి ముందుకొచ్చింది. దీంతో త్వరలోనే పార్కు అభివృద్ధి పనులు మొదలుకానున్నాయి. పార్కు అభివృద్ధిలో భాగంగా పార్కు ముందు భాగంలో ఉన్న 41 దుకాణాలను తొలగించనున్నారు. దీంతో తమకు ప్రత్యామ్నాయం కల్పించి దుకాణాలను తొలగించాలని చిరు వ్యాపారులు పీడీకి విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన పీడీ దుకాణదారులకు ప్రత్యామ్నాయం కల్పించాలంటూ కమిషనర్ శ్రీనివాసరావును ఆదేశించారు. కుప్పం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఇప్పటికే దుకాణదారులకు ఆరు నెలలు సమయం ఇచ్చారు. ఏ కాణాలను స్వచ్ఛందంగా ఖాళీ చేసేందుకు మరో రెండు నెలలు సమయం ఇస్తామని పీడీ తెలిపారు.

ప్రత్యామ్నాయం కల్పిస్తాం: కమిషనర్

20 ఏళ్లుగా పార్క్ దుకాణాల్లో దుకాణాల్లో ఉండి వ్యాపారం చేసుకుంటున్న వారికి ప్రత్యామ్నాయం చూపించమని ఇదివరకే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పీడి వికాస్ మర్మత్ పేర్కొన్నారని, పార్కు దుకాణదారుల వ్యాపారాలకు ఇబ్బంది కలగకుండా ఏదో ఒకచోట ప్రత్యామ్నాయం చూపిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రెండు నెలల్లో వ్యాపారులు దుకాణాలను స్వచ్ఛందంగా ఖాళీ చేసి పార్కు అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, ఏం సి డైరెక్టర్ ఇర్ఫాన్,సంఘ నాయకులు బుజ్జి, రత్నప్ప,ప్రసాద్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై వైద్యాధికారి హెచ్చరిక

ప్రజాశక్తి- రామకుప్పం: సీజన్ వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా వుండాలని మండల వైద్యాధికారి పూజిత హెచ్చరించారు. మండలంలోని విజలాపురం ఎస్టి ఆశ్రమ పాఠశాలలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వైద్య చికిత్సలు అందించు కోవాలన్నారు. ప్రధానంగా సికిల్ సెల్ అనిమియా రక్త పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి పిల్లలకు ఉచితంగా మందు లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిం చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఏఎన్ఎం శైలజ, సంధ్య, కావ్య, లావణ్య, ఆశ వర్కర్లు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సామాజికసేవ వైపు ముందడుగు వేయాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రన్ అన్నారు. కేవీకే మైదానంలో ఏర్పాటు చేసిన వాకర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం నిమిత్తం ప్రతిరోజు వాకింగ్ చేయడంతో పాటు పలువురికి వాకింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపి వాకింగ్ చేయిస్తూ ఆరోగ్య సలహాలు ఇస్తున్నామని ఈ సందర్భంగా దేశమ్మ దేవాలయ కమిటీ సభ్యునిగా నియమితులైన వాకర్స్ సభ్యులు సోమసుందరంను అసోసియేషన్ వారు సత్కరించారు.

అలరించిన కవి సమ్మేళనం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం చిత్తూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎస్.గిరిధరన్ అధ్యక్షతన జిల్లా కేంద్ర గ్రంథాలయం కవిసమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సెలవు దినాల్లో గ్రంథాలయాలను సందర్శించి గొప్పగొప్ప వ్యక్తుల చరిత్రలను, జీవిత గాధలను, విషయ పరిజ్ఞాన పెంచుకుని సమసమాజం కోసం కృషి చేయాలని తెలిపారు. ప్రముఖ రచయిత్రి అరుణకుమారి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయాల కోసం కృషి చేసిన మహామహా వ్యక్తులను గురించి వివరించారు.

రోడ్డుపైనే మురుగు

- ముస్లింవాడలో పారిశుద్ధ్యం అధ్వానం
- ఐదు నెలలుగా పట్టించుకోని అధికారులు
- ఫొటోలకే పరిమితమైన స్వచ్ఛ సంకల్పం

ప్రజాశక్తి- యాదమరి: మండలస్థాయి అధికారులు గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, పర్యవేక్షణ చేపట్టక పోవడంతో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ సంకల్పం లక్ష్యానికి దూరంగా వుంది. ప్రతినెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం యాదమరి మండలంలో ఫొటోలకు మాత్రమే పరిమితం అవుతోంది. క్షేత్ర స్థాయిలో గ్రామ పంచాయతీల పరిధిలోని పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదు.

ఈ నెల మూడవ శనివారం స్వచ్ఛఆంధ్రలో భాగంగా వ్యక్తిగత సామాజిక పరిశుభ్రత థీమ్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. అయితే యాదమరి మండల పరిధిలోని 14 ముస్లింవాడ గ్రామ పంచాయతీల పరిధిలో గత ఒకటి కాదు.. రెండు కాదు.. గత ఐదు నెలలుగా మురుగునీరు వీధుల్లోని రోడ్లపై పారుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచ్ పట్టించుకున్న పాపానపోలేదు.

14 కండ్రిగ గ్రామపంచాయతీ సచివాలయానికి ప్రతిరోజూ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అదే మురుగు నీటిని దాటుకుంటూ వెళుతున్నారు.. తప్ప ఆ మురుగు కాలువలకు మరమ్మతు చేపట్టలేదు. ముస్లిం వాడలో గతంలో నిర్మించిన డ్రైనేజీలలో పూర్తి స్థాయిలో పూడిక తీయక పోవడంతో మురుగునీటి కాలువలు పూడి పోయాయి. పూడిక తీయాల్సిన గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకున్న పాపానపోలేదు. ఈ మురుగు నీరు రోడ్లపై ప్రవహించి దిగువన ప్రభుత్వ పాఠశాల వద్దకు చేరుతోంది. నిత్యం గ్రామానికి వెళ్లే ప్రజలు ఈ దారి మీదుగా వెళ్లాలంటే ముక్కులు మూసుకొని వెళుతున్నారు. ముస్లింవాడ గ్రామాల్లో పూర్తి స్థాయిలో పూడిక తీయక పోవడంతో గ్రామంలోని ప్రధాని వీధుల్లో, కాలువలో మురుగు నీరు ఇళ్ల ముందు ప్రవహిస్తోంది. దీంతో ఇళ్ల చుట్టుపక్కల దుర్వాసన వస్తోంది. వర్షాకాలంలో కావడంతో విపరీతమైన దోమలు బెడద ఎక్కువగా ఉందని ముస్లింవాడ గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మురుగునీటి కాలువ నీటిని రోడ్డుపైకి రాకుండా ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వీధుల్లోనే ప్రవహిస్తున్న మురుగునీరు

ఆరు నెలలుగా కాలువలో పూడిక తీయలేదు

గత ఆరునెలలుగా 14 కండ్రిగ ముస్లింవాడలోని రోడ్లపై మురుగునీరు పారుతోంది. దీంతో దుర్వాసన ఎక్కువై ఇళ్లలో ఉండలేకపోతున్నాం. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. వర్షాకాలం కావడంతో కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల వల్ల రోగాల భారినపడుతున్నాం. వెంటనే కాలువల్లో పూడికలు తీయించి మురుగు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.
- మదీనా, గృహిణి, ముస్లింవాడ.

పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు..

రోడ్డుపై మురుగునీటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని పలు మార్లు పంచాయతీ అధి కారులకు చెప్పినా పట్టించు కోలేదు. వాసనకు ఇంటి దగ్గర ఉండలేక పోతున్నాం. దోమల వల్ల చిన్న పిల్లలకు జ్వరా లు వస్తున్నాయి. ఇప్పటి కైనా అధికారులు స్పందించి రోడ్డుమీద మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలి.
- రాజు, ముస్లింవాడ .

లైన్ మ్యాన్ మల్లారెడ్డి చొరవ

సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: విద్యుత్ తీగలకు అల్లుకున్న చెట్ల తీగలను కొమ్మలను లైన్ మ్యాన్ మల్లారెడ్డి చొరవతో సోమ వారం తొలగిం చారు. దీంతో విద్యుత్ తీగల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. నిత్యం దిన పత్రికలలో 'అల్లుకున్న నిర్లక్ష్యం' అనే శీర్షికన ఆయా మీడియా ప్రచురించేది. ప్రజాశక్తి ఈ సమస్యను తెరపైకి తెచ్చింది. స్పందించిన లైన్‌మ్యాన్ మల్లారెడ్డి సోమవారం మండలం లోని ఎల్లారెడ్డి కండ్రిగ సమీపంలో ఉన్న సబ్ స్టేషన్ 33 కెవి లైన్ కింద ఉన్న చెట్లను, విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలను జెసిబి సాయంతో తొలగించారు. అక్కడక్కడ తప్పి పోయిన చెట్లను, తీగలను సిబ్బంది తొలగించారు. రోడ్డుపై వెళుతున్న ప్రయాణికులు విద్యుత్‌కు అందిస్తున్న సేవలను కొనియాడారు. స్థానిక ఏఈ రియాజ్ బాష కొనసాగుతున్న పనులను పర్యవేక్షించి సమస్యకు పరిష్కారం లభించిందని సంతృప్తి వ్యక్తం చేశారు.

చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

అర్జీల వెల్లువ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్ర మైన సోమల తహ శీల్దారు కార్యా లయా నికి సోమ వారం వివిధ సమస్యల పరి ష్కా రం కోసం వచ్చిన అర్జీ దారులు పోటె త్తారు. అర్జీలు వెల్లు వెత్తా యి. భూ సమస్యలు, సర్వే విషయాలు, దారి సమ స్యలపై దాదాపు 30 వరకు దరఖాస్తులు అందాయని తహశీల్దారు మధుసూదన్ తెలిపారు. ప్రతి ఒక్కరి దరఖాస్తును పూర్తి స్థాయిలో పరిశీలించి కోర్టు వివాదాలు ఉన్న వారికి తీర్పు వచ్చేవరకు వేచి ఉండాలని, దారి సమస్యలు, జాయింట్ సర్వే, అటవీ, ప్రభుత్వ భూమి సంబంధిత విషయాలపై పూర్తి స్థాయి నివేదికలను తెప్పించుకొని పరిశీలించి తుది నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దారు

బోరు మోటారుకు పూజలు నిర్వహిస్తున్న కృష్ణమనాయుడు

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం

పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమనాయుడు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమనాయుడు పేర్కొన్నారు. మండలం లోని తూగుండ్రం పంచాయతీ, తూగుండ్రం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాలతో జెడ్పీ, ఎంపీపీ నిధుల సాయంతో ఏర్పాటు చేసిన కొత్త బోరు మోటారును సోమవారం లాంఛనంగా పూజలు నిర్వహించి ప్రారంభిం చారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమనాయుడు స్థానిక పిహెచ్‌సి డాక్టర్లు ప్రవీణ్, మౌనిక డాక్టర్లను అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ, జిల్లా టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, తూగుండ్రం మాజీ పిహెచ్‌సి ఛైర్మన్ నరసింహనాయుడు, జిల్లా క్రిస్టియన్ సెల్ కార్యదర్శి శాంత్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరజాక్షులు రెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు బాబు నాయుడు, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర, మండల మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అతేహర్ అలీ, పంచాయతీ సెక్రెటరీ శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ కర్ణ, పలువురు పిహెచ్‌సి సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

గోకులం నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి: ఏపీడీ

ప్రజాశక్తి -సోమల: మండలంలో పాడి రైతులు తమ పాడి పశు వుల కోసం నిర్మిస్తున్న గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని తద్వారా సకాలంలో బిల్లులు అందే అవకాశం ఉందని ఏపీడీ శ్రీనివాసులు రైతులను కోరారు. సోమవారం సోమల పంచాయతీకి చెందిన పిఎస్ నాగరాజా నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు ప్రభుత్వం అందించిన నిధులతో పాటు తన సొంత నిధులు సైతం వెచ్చించి చాలా బాగా నిర్మాణం చేపట్టారని ప్రశంసించారు. ఏపీవో షౌకత్ అలీ మాట్లాడుతూ మండలానికి 191 గోకులం షెడ్లు నిర్మాణం చేసేందుకు అనుమతులు వచ్చాయని వీటిలో ఇప్పటి వరకు 80 నిర్మాణా లు పూర్తయ్యాయని మిగిలిన గోకులం షెడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, ఇప్పటి వరకు ఒక కోటి 8 లక్షల రూపాయలు గోకులం షెడ్ల నిర్మాణానికి ఖర్చు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఫీల్డ్ అసిస్టెంట్ రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్య గారి పల్లె జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయు రాలు శిరీష పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి అండర్ 17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఎం మధుప్రియ ఈనెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని, అండర్ 14 సాఫ్ట్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎస్ మహమ్మద్ తౌషిక్, ఎల్‌టి మహమ్మద్ అఫ్సాన్‌లు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు పులివెందు లలో నిర్వహించే పోటీలలో పాల్గొం టారన్నారు. వారు రాష్ట్ర పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా వుందని వ్యాయామ ఉపాధ్యా యులు శివకుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ ఉపాధ్యాయుడు

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం: ఎంపీడీవో

ప్రజాశక్తి -సోమల: మండలంలోని పంచాయతీల పరిధిలో గ్రామాలను సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పర్యావరణ సంరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించడమే ధ్యేయంగా ప్రజలకు అవగాహన కల్పించి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల సహకారంతో ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని ఎంపీడీవో సివిఎస్‌వి ప్రసాద్ కోరారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులు, ఉప సర్పంచులు , పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక శిక్షణ పొంది వచ్చిన పంచాయతీ కార్యదర్శి ఫయాజ్ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్‌లను అన్ని పంచాయతీలలో ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు అన్ని గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపడేలా చెత్తా చెదారాన్ని తొలగించాలని సూచించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని అందుకోసం ప్రజలకు అవ గాహన కల్పించాలని, మురుగునీటి కాలువల శుభ్రత , బృందావనాల వాడకం తప్పక జరిగేలా చూడాలని కోరారు. ఇదే క్రమంలో పచ్చదనం పెంపొందించేందుకు, మొక్కలు నాటేందుకు చొరవ చూపాలని తెలిపారు.

28 మందికి ముగ్గురే హాజరు

ముగ్గురు సర్పంచులు హాజరైన దృశ్యం(ఫొటోలో కుడివైపు ఉన్న వారు)

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పర్యావరణం సంరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించడంపై అవగాహన కార్యక్ర మానికి మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు హాజరుకావాలని అధికారులు సర్క్యులర్లు అందించారు. 14 మంది సర్పంచులు, 14 మంది ఉపసర్పంచ్‌లు హాజరు కావాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. ప్రజలు ఎన్నుకున్న సర్పంచులు, ఉపసర్పంచులు, పంచా యతీల అభివృద్ధి, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా విధులు నిర్వర్తించాల్సి ఉండగా ఇలాంటి శిక్షణ తరగతులకు హాజరు కాకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టిడిపి సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - రొంపిచర్ల : పుంగనూరు నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమీక్ష సమావేశం, కమిటీ ఏర్పాటు, అవగాహన కార్యక్రమాలను పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రొంపిచర్ల మండలం పెద్ద గొట్టిగల్లు సమీపంలోని విఎంఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ పరిశీలకులు, శాప్ చైర్మన్ రవి నాయుడు, కర్నాటి అమరనాథ రెడ్డి, అశోక్ హాజరయ్యారు. పుంగనూరు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి కమిటీలు ఏర్పాటుకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన నియోజకవర్గ పరిశీలకులు, మండల పరిశీలకులు కలిసి సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ పరిశీలకులు రవి నాయుడు, కర్నాటి అమరనాథ్ రెడ్డి , అశోక్, మండల పరిశీలకులు మాట్లాడుతూ టిడిపి క్రమశిక్షణకు మారుపేరని కమిటీలు ఏర్పాటులో అలసత్వం వహించ కుండా అందరూ సమిష్టిగా పనిచేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఈ సమావేశంలో సూచించారు. పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామ, మండల కమిటీలను ఎన్నుకోవటంలో కార్యకర్తల సూచనల మేరకు పార్టీని బలోపేతానికి, అభివృద్ధికి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి మండలంలో ఎంపీపీలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసీలు, సర్పంచులు అందరూ గెలిచేలా నాయకులు సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, వెంకట రమణ రాజు, మధుసూదన్ నాయుడు, ఉయ్యాల రమణ, నియోజక వర్గంలోని అన్ని మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చల్లా రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : మాజీ మంత్రి ఆర్‌కెరోజా పుట్టినరోజు వేడుకలను మున్సిపల్, మండల పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండు ప్రాంగణం లోని వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఆర్‌కెరోజా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. వైఎస్‌ఆర్‌కు పూలదండ వేసి అనంతరం పుట్టినరోజు కేక్ కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచారు. అనంతరం బస్టాండు ప్రాంగణంలో 500 మంది పేదలకు అన్నదానం చేశారు. విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద వైయస్‌ఆర్ విగ్రహానికి వ్రాలవాలవేని వైసిపి నాయకులు పుట్టినరోజు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల బాలాజీ, మండల కన్వీనర్ యువరాజు, మండల నాయ కులు గుణశేఖర్ రెడ్డి, నార్పరాజు, గోవర్ధన్ నాయుడు, ప్రసన్న , రాజ గోపాల్, సుబ్బు, ప్రసాద్, దినకర్, డేవిడ్, సర్పంచులు ఎంపిటిసిలు, నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, వైసిపి పట్టణ అధ్యక్షులు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

22న ప్రత్యేక ప్రతిభావంతులకు అసెస్‌మెంట్ క్యాంప్

ప్రజాశక్తి -విజయపురం (నగరి): భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సూచనల మేరకు కలెక్టర్ ఆదేశానుసారం ప్రత్యే ప్రతిభావంతులకు పరికరాలను అందించడానికి ప్రత్యేక అసెస్‌మెంట్ క్యాంప్‌ను ఈ నెల 22వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరి మున్సిపాలిటీ, నగరి మండలం, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన దివ్యాంగులకు నగరి పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఆర్డీవో అనుపమ నేతృత్వంలో నిర్వహించే ఈ క్యాంప్‌కు డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్, చిత్తూరు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు.

రోడ్డు నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

-ఎమ్మెల్యే చొరవతో పరిష్కారం
- రెండు రోజుల్లో పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలంలోని రాయలపేట పంచాయతీ కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులకు అడ్డంకులు తొలిగాయి. ఈ పనులకు సంబంధించి అధికారు లు, నిర్వాసితులతో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సమీక్షించారు. రోడ్డు విస్తరణకు కొంత మంది అభ్యంతరాలు తెలుపుతుండడంతో నాలుగు రోజుల క్రితం రాయలపేట గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. దీంతో అందరి అంగీకారంతోనే పనులు కొనసాగుతాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన సర్ది చెప్పారు. అయితే పలువురికి విస్తరణ సందర్భంగా తమ ఇల్లు, దుకాణాలు అధిక శాతం తొలగించాల్సి ఉంటుందనే ఆందోళన నేపథ్యంలో రెవెన్యూ, ఆర్ అండ్ బి అధి కారులతో పాటు గ్రామ స్తులతో సమా వేశం నిర్వహించి అభిప్రాయ సేక రణ చేపట్టారు. ఎట్టకేలకు రోడ్డు నిర్మాణానికి గ్రామస్తులందరూ సమ్మతించడంతో బుధవారం నుంచి పనులు జరిగేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమీక్షలో తహశీల్దార్ హనుమంతు నాయక్, ఆర్అండ్‌బి డీఈ ధనలక్ష్మి, ఏఈ ఆదికేశవులుతో పాటు సిబ్బంది , రాయలపేట వాసులు ప్రకాషం శెట్టి, శివయ్య శెట్టి, రమేష్, లక్ష్మీనారాయణ శెట్టి, రెడ్డెప్ప శెట్టి, నోమురాజు, చంద్రయ్య, రవి, బాలు, బుద్దు, జిలాని,షౌకత్ మార్కొండయ్య, బాలాజీ, చలపతి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై నిర్వాసితులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

క్రైం న్యూస్

బస్సు ఢీకొని పాదచారుడు మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బస్సు ఢీకొని పాదచారుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని కేజీ సత్రం వద్ద చోటు చేసుకుంది. సిఐ శ్రీనివాస్ కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం మహాసముద్రం గ్రామానికి చెందిన రంగారెడ్డి కుమారుడు సుబ్రహ్మణ్యం రెడ్డి కేజీ సత్రం వద్ద నడుచుకుంటూ వెళుతుండగా తిరుపతి నుండి మంగళూరు వెళుతున్న బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో సుబ్రహ్మణ్యం రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

27 మంది సచివాలయ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: 27 మంది సచివాలయ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు, ఎంపీడీవోలకు సోమవారం ఓ ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో మొత్తం 612 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో పనిచేయాల్సిన సిబ్బంది సంఖ్య 4,477 ఉండగా, ప్రస్తుతం 4,040 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 437 మంది విధులకు హాజరు కావడం లేదని ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా తెలిపారు.

ఈ 437 మందిలో 152 మంది మెడికల్ లీవ్‌లో ఉన్నారు. 251 మంది వివిధ శాఖల్లో డెప్యుటేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. 27 మంది అనధికారిక సెలవులో ఉన్నారు. దీనిపై కలెక్టర్ సమీక్షించారు. సచివాలయ సిబ్బంది సచివాలయంలోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితిలో, అనధికారికంగా సెలవులు తీసుకోవడం సరికాదని పేర్కొంటూ వీరి పై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

దీననుసరించి, అనధికారిక సెలవులో ఉన్న 27 మంది సిబ్బందిపై క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకోవాలని తెలిపారు.మెడికల్ లీవ్‌లో ఉన్న 152 మందిని మెడికల్ బోర్డుకు పంపించి పరీక్షలు నిర్వహించి, తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. అందువల్ల, అందరూ ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రస్తుతం సెలవులో ఉన్న సిబ్బంది వెంటనే విధులకు హాజరుకావాలని వారికి సూచించాలని ఆదేశించారు. ఎలాంటి ఆలస్యం జరిగినా, సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

కుప్పంలో అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి -కుప్పం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో భాగంగా సోమవారం కడ పీడీ వికాస్ మర్మత్ కుప్పంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేది లేనిది అర్జీదారులకు తెలపాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నవంబర్ నెలాఖరిలో జననాయకుడు ఫిర్యాదులపై ప్రత్యేకంగా అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. డిసెంబర్లో సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన ఉంటుందని సీఎం పర్యటనకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈలు గురువారెడ్డి, పురుషోత్తం, డి టి సూర్యప్రకాష్ , ఏపిఎం చంద్రశేఖర్ అధికారులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా సెంథిల్ కుమార్

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా సెంథిల్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుప్పం కొత్త పేటలోని శ్రీ అంకాల పరమేశ్వరి ఆలయంలో సోమవారం మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సెంథిల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా మోహన్ కుమార్, సెక్రెటరీలుగా ప్రకాష్, మురుగేష్ నాటర్, కృష్ణన్, శేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల అధికారిగా పుల్లయ్య, పలని, జయంతి వ్యవహరించారు. నూతన కమిటీ ఐదు సంవత్సరాల పాటు కొనసాగనుంది.

విద్యార్థులకు నైపుణ్య పోటీలు

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 58వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం గ్రంథాలయ అధికారులు విద్యార్థులకు నైపుణ్యత పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు కవి సమ్మేళనం, సెమినార్‌లు నిర్వహించారు. ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపులో బహుమతులు అందిస్తామని గ్రంథాలయ అధికారి గురుమూర్తి తెలిపారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామల, ఉపాధ్యా యులు రేవతి, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కఠారి దంపతుల వర్ధంతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మాజీ మేయర్ కఠారి అనురాధ, కఠారి మోహన్ 10వ వర్ధంతిని చిత్తూరు నగరంలో వాడవాడలా టిడిపి నాయకులు, కఠారి అభిమానులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భం గా పలు ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. కైనుకట్టు వీధిలో మాజీ కార్పొరేటర్ గుణశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, పూతలపట్టు ఎంఎల్ఏ మురళీమోహన్, చూడు చైర్‌పర్సన్ కఠారి హేమలత, నగర కోఆప్షన్ సభ్యులు కోలా కిరణ్, కఠారి కిరణ్, కఠారి లావణ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పిఈఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆదివారం నిర్వహించిన ఇంటర్ నేషనల్ ప్రాడిజీ కాంపో జీషన్‌లో దేశం నలుమూలలు, విదేశాల నుండి మొత్తం 5, 870 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పిఈఎస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి స్థానాలను సాధించారు. విజేతలుగా ఎస్.భర్గవ్, రన్నర్-అప్స్ (రాష్ట్ర స్థాయి స్థానాలు) కె కార్తీక్ సాయి, పివి కార్తీక్, జె.కిశోర్, ఎస్‌దీక్షిత, ఎన్వీవిన్నేశ్ చౌదరి, ఎస్ మోహిత్ నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్ అభినందనలు తెలపడంతో పాటు అబాకస్‌లో చిత్తూరు గర్వకారణంగా పిఈఎస్ విద్యార్థులు నిలిచారని కొనియాడారు.

IN THE COURT OF THE HON'BLE PRL, CIVIL JUDGE (JUNIOR DIVISION),CHITTOOR
I.A.No. 447 of 2023
O.S.No. 451 of 2022

Between:-
P.Mangamma and others ... Petitioners/Plaintiffs
And:-
G.Subramanyam and others ...Respondents/Defendants

To **NOTICE TO R7**

R7) Noorjahan, w/o not known, 1st street, Elementary school back side, Yadamari village and mandal, Chittoor district.

Madam, Please take notice that the Plaintiffs filed the above suit for partition, allotment and separate possession of their legitimate share in the suit schedule properties and the plaintiffs also filed IA.No.447/2023 to implead the government officials as parties to the suit. The above said IA stands posted to **18-12-2025** for your appearance. Therefore, you please be appear before the above court on **18-12-2025 at 10-30 A.M.** either by you personally or through your Advocate and file your objections if any, otherwise, the matter will be decided ex-parte according to law.

Sd/- **U.SESHADRI NAIDU**
Advocate for Petitioner/Plaintiff
Place:Chittoor, Date: 16.11.2025